సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



నష్ట పరిహారం ఇవ్వండి

తూముకుంట గ్రామం సోలార్‌కు హెచ్‌పీసీఎల్ కంపెనీ వారు నష్ట పరిహారం చెల్లించకుండానే తమ భూమిని స్వాధీనం చేసుకున్నారని పేద రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - 8లో



రైలు ప్రమాదంలో తెగిపడిన యువకుడి చేయి

నందలూరు రైల్వే కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం రైలు కింద పడి యువకుడి చేయి తెగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.360	రూ.400
రెండోరకం	రూ.290	రూ.356

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 119 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

వైభవం..పల్లకీ ఉత్సవం



పల్లకీలో కొలువుదీరిన శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడు పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి మూల విరాట్‌లకు ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, మల్లిఖార్జున స్వామి, వేదపండితులు రాచరాయ యోగీ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధుల్లో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సౌజన్యంతో ఎలక్ట్రానిక్స్ సెక్టార్, స్కిల్ కౌన్సిల్ ద్వారా సమగ్ర శిక్ష అభియాన్‌లో వృత్తి విద్యా శిక్షకులకు, ఫీల్డ్ టెక్నిషియన్లు, హోం అప్లియన్సెస్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు న్యాక్ డైరెక్టర్ రాకేష్ తెలిపారు. ఈ శిక్షణకు ముఖ్య అతిథులుగా జీసీడీవో విజయలక్ష్మి, ఎంఈఓ ఎస్.రావులు హాజరై మాట్లాడారు. శిక్షణ కార్యక్రమాన్ని సుమారు 10రోజులపాటు నిర్వహించనున్నట్లు వివరించారు. వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించడానికి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మాస్టర్ ట్రైనర్లు శ్యాం ప్రసాద్, నాగేంద్ర కుమార్, అహుజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడి ఎంపిక

వైవీయూ : రెవల్యూషనరీ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యూ) జాతీయ అధ్యక్షుడిగా కడపకు చెందిన వి. రవిశంకర్‌రెడ్డి ఎన్నికయ్యాడు. తిరుపతి వేదికగా నిర్వహించిన ఆర్ఎస్‌యూ ప్రథమ జాతీయమహాసభల్లో జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకున్నట్లు రవిశంకర్‌రెడ్డి తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని తెలిపారు.

ముగిసిన శ్రీరంగనాథస్వామి నూలు పూజ పవిత్రోత్సవాలు


పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో వినాయక చవితి పండుగ మరుసటి రోజు నుంచి 9 రోజుల పాటు నూలు పూజ పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా సోమవారం సతీసమేత శ్రీరంగనాథస్వామి హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణ రాజేష్ శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకంగానే వైద్య విద్యార్థులకు అన్యాయం...




మదనపల్లె మెడికల్ కళాశాల నిర్మాణపనులు 75శాతం పూర్తయ్యాయి., కళాశాల ప్రారంభించేందుకు జిల్లా ఆస్పత్రిలో అదనపు భవనాల నిర్మాణం జరిగినప్పటికీ, ఉద్దేశపూర్వకంగానే రాష్ట్రప్రభుత్వం వైద్యవిద్యార్థులకు అన్యాయం చేసింది. గత ప్రభుత్వం ఈ ఏడాది 5 వైద్యకళాశాలలను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ, కావాలనే ప్రారంభించకుండా సుమారుగా 750 మెడికల్ సీట్లు విద్యార్థులు నష్టపోయేలా చేశారు. ఇవేమీ తెలియకుండా వైద్యశాఖ మంత్రి గత ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని విమర్శిస్తూ మాట్లాడటం బాధాకరం.

– ప్రసాదరెడ్డి, మదనపల్లె.



మంత్రి విమర్శలు సరికాదు



టీడీపీ పాలనలో ఒక్క మెడికల్ కళాశాల కూడా రాలేదు. పేద, మధ్య తరగతి విద్యార్థుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని గత ప్రభుత్వంలో మెడికల్ కళాశాలలను పకడ్బందీ ప్రణాళికతో ప్రారంభించారు. మిగతా ప్రక్రియను పూర్తి చేయకుండా ప్రైవేట్‌పరం చేసి, జగన్ వచ్చి పాఠాలు చెబుతారా అంటూ మాజీ ముఖ్యమంత్రిని మంత్రి సత్యకుమార్ విమర్శించడం సరి కాదు. పేద విద్యార్థులు వైద్య విద్య చదవాలంటే లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వమే బాధ్యతగా మెడికల్ కళాశాలలను నిర్వహించి మెడికల్ సీట్లు కేటాయించాలి.

– దేవనాథరెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్.

ధీమాకు ఎసరు!



జిల్లాలో రైతులు	: 2,50,000
రబీసాగు	: 60వేల ఎకరాలు
గత ప్రభుత్వం ప్రతి ఏడాది ఒక్కో రైతుకు అందించిన సొమ్ము	: 13,500

- ఉచిత పంటబీమా పథకం అమలులో సర్కారు నిర్లక్ష్య ధోరణి
- ప్రస్తుత రబీ సీజన్‌కు రైతులే బీమా ప్రీమియం చెల్లించాలని ఆదేశాలు
- రైతుపై భారం లేకుండా ఐదేళ్లు ధీమా ఇచ్చిన వైఎస్ జగన్ సర్కార్



సుండుపల్లె మండలం చిన్న గొల్లపల్లె గ్రామంలో వాడిపోయిన వేరుశనగ పంటను చూపుతున్న రైతు

సాక్షి రాయచోటి : అన్నదాత నెత్తిన పిడుగు పడుతోంది. ప్రభుత్వం చెల్లించాల్సిన సొమ్ములను సైతం రైతులపైనే భారం పెడుతున్నారు. సూపర్ సిక్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇప్పటికీ వాటి ఊసెత్తడం లేదు. చివరకు రైతులకు సంబంధించి బీమాతోనే చెలగాటం మొదలు పెట్టారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటినా ఇప్పటికీ కనీసం అన్నదాత సుఖీభవ (వైఎస్సార్ రైతు భరోసా) నిధులు ఇవ్వలేదు.పేరు మాత్రం వెంటనే మార్చారు. కానీ రైతులకు మాత్రం సొమ్ములు అందించలేదు. ఖరీఫ్ సీజన్ అన్నదాతను కాటేసింది. కనీసం రబీలో పంటసాగుకు సన్నద్ధమైన వారికి ప్రభుత్వం అండగా ఉండకపోగా...ఏకంగా పంటల బీమాకు సంబంధించి ప్రీమియం రైతులే చెల్లించాలని ఆదేశాలు జారీ చేయడం గోరుచుట్టుపై రోకలిపోటులా మారింది.

కష్టకాలంలో అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

2019 ఎన్నికల అనంతరం అధికారంలోకి వైఎస్సార్‌సీపీ రాగానే అన్నదాతకు అండగా నిలబడింది. వెంటనే రైతు భరోసా కింద రూ. 13,500 చొప్పున అందించింది. ఐదేళ్లపాటు రైతు భరోసా కింద నిధులు అందిస్తూనే జగన్ సర్కార్ సహకారం అందించింది. అంతేకాదు... ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసే పంటలపై ఉచిత పంటల బీమా పథకం కింద ప్రీమియంకూడా చెల్లిస్తూ వచ్చారు. అన్నదాత ఏ పంట వేసినా అందుకు సంబంధించి సీజన్ల వారీగా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించింది. అంతేకాకుండా ఏడాదిలోపలే నష్టపోయిన పంటలకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు పంటల బీమాను కూడా అందించారు. ఇలా జగన్ సర్కార్ ఐదేళ్లు ప్రతిసారి అన్నదాతకు ఆపదలో అండగా నిలబడుతూ వచ్చింది. జిల్లాలో ఖరీఫ్ కరువు కాటుకు బలైంది. ఖరీఫ్‌లో సుమారు లక్షా 20 వేల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా, వర్షాలు లేక అంతంత మాత్రంగానే పంటలు సాగయ్యాయి. అవి కూడా వాడిపోయి ఎండిపోతున్నాయి. మరో వైపు రబీ సీజన్ సాగవుతున్న తరుణంలో వరుణుడి కరుణ కోసం రైతన్నలు ఎదురు చూస్తున్నారు. ఎప్పుడు వర్షం కురిసినా అరుతడి పంటలు వేసేందుకు సిద్ధమయ్యారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం అన్నదాతల తలపై ప్రీమియం భారం మోపుతోంది.

అన్నదాతపై భారం

ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసే అన్నదాతలు పంట నష్టపోతే అందించే బీమా వ్యవహారానికి సంబంధించి ప్రభుత్వం చెల్లించాల్సిన ప్రీమియాన్ని నిలుపుదల చేసింది. రైతులే రబీ సీజన్‌లో పంటలకు ప్రీమియం చెల్లించుకోవాలని ఇటీవల ఆదేశాలు అందాయి. దీంతో పంటలపై పెట్టుబడి భారంతోపాటు బీమాకు సంబంధించి ప్రీమియం భారం కూడా పడనుంది. ఏది ఏమైనా అన్నదాతలను ఆదుకునే సంగతి దేవుడెరుగు కష్టకాలమంటూ చెవులు కొరుక్కోవడం కనిపిస్తోంది.

గత ప్రభుత్వం ప్రీమియం చెల్లించేది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పంటకు సంబంధించిన ప్రీమియం సమయానికి చెల్లించేది. అంతేకాకుండా రైతు భరోసాను అందించి అన్నదాతకు ఆసరాగా నిలిచింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, గొప్పలు చెప్పడంతో అందరూ అటు వైపు మొగ్గు చూపారు. మూడునెలలు అయినా ఇప్పటివరకు రైతులకు ఎలాంటి రాయితీలు అందలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఉచిత పంటలబీమా ఖరీఫ్‌కు పరిమితం చేయడంతో ఏమి చేయాలో అర్థం కావడం లేదు.

– శివయ్య, రైతు, శెట్టిపల్లె గ్రామం, సంబేపల్లె

పంటల బీమా ప్రీమియం చెల్లించాలి



రైతుల సంక్షేమమే కీలకం, రైతు భరోసా నిధులు, పంటల బీమా ప్రీమియంలతో సహా పెట్టుబడి మద్దతు కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేయాలి. కోస్తా ప్రాంతాలు భారీ వర్షాల ముప్పును ఎదుర్కొంటుండగా, రాయలసీమ కరువు ప్రమాదంలో ఉంది. ఇప్పటికే ప్రతికూల వాతావరణ పరిస్థితులతో రైతులు సతమతమవుతున్నారు. అన్నదాతలు నష్టపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ప్రీమియం చెల్లించి ఆదుకోవాలి.

– ఎస్.రామచంద్ర, జిల్లా కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

ఇసుక టోకెన్ల కోసం జాగారం

రాత్రి తొమ్మిది గంటల నుంచే సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద బారులు



సోమవారం రాత్రి ఇసుక టోకెన్ల కోసం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద క్యూలో ప్రజలు

రాజంపేట టౌన్ : ఇసుక కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉన్నాయి. ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలని కొందరు, ఇసుక టోకెన్ దొరికితే జానెడు పొట్టను నింపుకోవచ్చని ట్రాక్టర్ డ్రైవర్లు ఆరాటపడుతున్నారు. అందుకోసం ఇటు భవన నిర్మాణ యజమానులు అలాగే ట్రాక్టర్ డ్రైవర్లు ఇసుక టోకెన్ల కోసం ముందు రోజు రాత్రి నుంచే సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి క్యూలో నిలుచొని తెల్లవార్లు జాగరణ చేస్తున్నారు. ఈనెల 15వ తేదీ ఆదివారం, 16వ తేదీ మిలాద్ ఉన్ నబీ కారణంగా ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో ఇసుక టోకెన్లు ఇవ్వలేదు. రెండు రోజులు ఇసుక సరఫరా లేక పోవడంతో సోమవారం రాత్రి 9 గంటలకే చాలా మంది సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి వరుస క్రమంలో ఉన్నారు. వీరంతా రాత్రి అక్కడే పడుకోనున్నట్లు తెలిపారు. వీరిలో 29 మంది ట్రాక్టర్‌కు, 40 మంది టిప్పర్‌కు సంబంధించిన వారు ఉన్నారు. అయితే రోజుకు 40 ట్రాక్టర్లకు, 40 టిప్పర్లకు మాత్రమే అధికారులు టోకెన్లు ఇస్తున్నారు. ఇదిలావుంటే సోమవారం రాత్రి నుంచి క్యూలో ఉన్న వారికి అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం టోకెన్లు ఇస్తారు. ఇసుక కోసం ప్రభుత్వం పెడుతున్న కష్టాలకు పలువురు దుమ్మెత్తిపోశారు.

నేటినుంచి స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



రాయచోటి : ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు స్వభావ్ స్వచ్ఛతా సంస్కార్ స్వచ్ఛత అనే ఇతివృత్తంతో స్వచ్ఛతాహీ సేవ-2024 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు జిల్లాస్థాయిలో 15 మంది అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాలన్నారు. వాటిని అక్టోబర్ 1వ తేదీలోపు ఆయా గ్రామాల్లోని యువత, స్వయం సహాయక సంఘాలు, పాఠశాల, కళాశాలల విద్యార్థులు, రైతులు స్వచ్ఛంద సంస్థలతో కూడిన ప్రజా సమూహం సహాయంతో శ్రమదానం ద్వారా పరిశుభ్రపరచాలన్నారు. అక్టోబర్ 2న జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి అవార్డులు, సఫాయి మిత్రులకు సన్మానం ఉంటాయన్నారు. మొదట ఈనెల 17న స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం జిల్లా, మండలస్థాయిలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో ప్రారంభమవుతుందని తెలిపారు. 17న మానవహారం (హ్యూమన్ చైన్), 18న మొక్కలు నాటే కార్యక్రమం, 19న స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం గురించి ఇంటింటికి తిరిగి ప్రచారం చేయడం, 20న పాఠశాల స్థాయిలో స్వభావ్ స్వచ్ఛత.. సంస్కార్ స్వచ్ఛత గురించి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 21న క్విజ్, వ్యాస రచన పోటీలు, 22న కార్యక్రమ ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియా,డిజిటల్ మీడియాలో అప్‌లోడ్ చేసి మరింత మందికి అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. 23న వేస్ట్ ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహణ, 24న గ్రామ పంచాయతీలో ప్రత్యేక గ్రామ సభలు, నిర్వహిస్తామన్నారు. 25న సఫాయి కార్మికులకు అందుతున్న సేవలు గురించి సర్వే చేయడం, 26న సఫాయి మిత్రులకు వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలు పెద్దఎత్తున స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమాలలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

ప్రవక్త బోధనలు అనుసరణీయం

సాక్షి నెట్‌వర్క్ : జిలావ్యాప్తంగా సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు.రాయచోటి పట్టణంలోని దర్గాలో మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి వారి పూర్వీకుల (పెద్దలు)ను స్మరించుకున్నారు. భక్తులకు భోజన వసతి కల్పించారు.ఓబులవారిపల్లె మండల కేంద్రంలోని మదీనా మసీదులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాఫీజ్ సాహెబ్ మైనుద్దీన్ మాట్లాడుతూ మానవ మహోపకారి ప్రవక్త మహమ్మద్ అని అన్నారు.ప్రవక్త బోధనలు అనుసరణీయమని అన్నారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. మదనపల్లెలోని మోతీనగర్ మసీదు నుంచి ముస్లిం సోదరులు సామూహికంగా శాంతి ర్యాలీ నిర్వహించారు.తంబళ్లపల్లె, పెద్దతిప్పసముద్రం మండలాల్లో కూడా ముస్లిం సోదరులు ఘనంగా మిలాద్‌ఉన్‌నబీ ఘనంగా జరుపుకున్నారు.



మదనపల్లెలో : శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

ఘనంగా మిలాద్ జెండా ఊరేగింపు

కమలాపురం : జష్నే మిలాద్-ఉన్-నబి జెండా ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సోమవారం పీఠాధిపతి శ్రీ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో, దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ పర్యవేక్షణలో ఆస్థాన-ఏ-జహీరియా నుంచి దర్గా-ఏ-గఫారియా వరకు మిలాద్-ఉన్-నబి జెండా ఊరేగింపు అశేష భక్త జన సందోహం నడుమ భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం పెద్ద దర్గా ఆవరణలో మిలాద్ జెండాను పీఠాధిపతి ప్రతిష్ఠించారు. అనంతరం స్వాముల వారి మజార్లపై పూల చాదర్‌లు సమర్పించి, ప్రత్యేక ఫాతెహా చేశారు. పీఠాధిపతి సోదరులు దస్తగిరి స్వామి, మౌలానా స్వామి, గౌస్‌పాక్, జియా, ఇస్మాయిల్, సర్ఫరాజ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే కుమ్మరివీధిలో వెలసిన తాళిం, తూర్పు వీధిలో వెలసిన జెండా చెట్టు వద్ద ఆ కాలనీల యూత్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో మిలాద్ వేడుకలు నిర్వహించారు.



కమలాపురం జెండా ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు, భక్తులు

జోరుగా ఓటరు జాబితా సవరణ

- జిల్లాలో ప్రారంభమైన పరిశీలన
- అక్టోబర్ 18 వరకు ఇంటింటి పరిశీలన పూర్తి చేయాలని లక్ష్యం
- 18 ఏళ్లు నిండిన వారి పేర్ల నమోదుకు అవకాశం



ఓటర్ జాబితా పరిశీలన కార్యక్రమాన్ని తనిఖీ చేసిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు (ఫైల్)

జిల్లాలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుష ఓటర్లు	మహిళా ఓటర్లు	ఇతరులు	మొత్తం
రాజంపేట	117577	123617	06	241200
కోడూరు	100663	103794	09	204466
రాయచోటి	126090	129051	27	255168
తంబళ్లపల్లి	110627	114163	12	224802
పీలేరు	114962	119624	22	234608
మదనపల్లి	130461	136078	51	266590

రాయచోటి : నూతన ఓటర్ల నమోదు, పాత ఓటర్ల జాబితాలో తప్పు, ఒప్పుల సవరణకు ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. జిల్లాలో ఎన్నికల సంఘం ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టింది. మరోసారి నూతన ఓటర్లు నమోదు ఇప్పటికే నమోదైన వారి పేర్లు, చిరునామా, సవరణలకు శ్రీకారం చుట్టింది. తద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఆ దిశగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోంది. ఓటరు నమోదుకు ప్రీ రివిజన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ ఏడాది సంక్షిప్త ఓటరు జాబితా సవరణలను ప్రారంభించింది. ప్రస్తుతం బూత్ స్థాయి అధికారులు ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు.

ఓటర్ల సవణలు.....

మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు వారం రోజులు ముందుగా ఎన్నికల సంఘం ఓటరు తుది జాబితాను కొందరు నిర్లక్ష్యం ప్రదర్శించడం, సకాలంలో స్పందించకపోవడంతో ఓటు నమోదు చేసుకోలేకపోయారు. అలాంటి వారికి ఎన్నిక సంఘం ఏటా ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అర్హులను చేర్చడం, అనర్హులను తొలగించే ప్రక్రియ చేపడుతోంది. ఎప్పటిలాగా ఈ ఏడాది సైతం బూత్ స్థాయి ఉద్యోగులు క్షేత్రస్థాయిలో కార్యక్రమాన్ని చేపడుతున్నారు. గ్రామాల్లో పర్యటించి సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు జాబితాలో ఉన్న వివరాల ప్రకారం సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలు రూపొందించుకొని సర్వే చేపడుతున్నారు. ప్రధానంగా ఓటరు జాబితాలో ఉన్న చిరునామాలో సదరు వ్యక్తి నివసిస్తున్నారా లేదా తన ఓటు మరో ప్రాంతానికి బదిలీ చేయాలా అనే విషయంపై ఆరా తీస్తున్నారు. పేర్లు, చిరునామాలో ఎలాంటి సవరణలు చేపట్టాలి, ఫొటోలు మార్చాలా, ఏవైనా మార్పులు ఉన్నాయా అని పలు అంశాలపై ప్రశ్నిస్తున్నారు. ఓటర్లు కోరితే మార్పు చేసే ప్రక్రియకు నాంది పలుకుతున్నారు.

- సార్వత్రిక ఎన్నికలకు ముందు స్వీప్ ఓటరు అనే పేరుతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బీఎల్‌ఓలను రంగంలోకి దింపి ఓటు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. యువతీ యువకులు సైతం ముందుకు రావడంతో జిల్లాలో రికార్డు స్థాయిలో కొత్త ఓట్లు నమోదయ్యాయి.

కొత్తగా నమోదుకు అవకాశం

కొత్త ఓటర్ల నమోదు సైతం దృష్టి సారిస్తున్నారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే యువత ఎవరైనా ఉన్నారా అని ఆరా తీస్తున్నారు. ఇప్పటికే 18 ఏళ్లు నిండి ఓటరుగా నమోదుకాని వారిని గుర్తిస్తున్నారు. ఒకవేళ ఉంటే వారి వివరాలు నమోదు చేసుకుంటున్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల ప్రస్తుత పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఇందుకోసం బీఎల్‌ఓలు యాప్‌ను రూపొందించి అందులో ఈ అంశాలను నమోదు చేసి ఆన్‌లైన్ చేస్తున్నారు.

అక్టోబర్ 18 నాటికి పూర్తి..

ఓటర్ల పోలింగ్ కేంద్రాల పరిశీలన, రాజకీయ పార్టీలతో చర్చించడం, అక్టోబర్ 18 నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఓటర్ల సంఖ్య 1500కు మించకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రం ఓటర్లకు రెండు కిలోమీటర్ల దూరం మించకుండా ఉండేలా చూస్తున్నారు. అక్టోబర్ 18 నాటికి కార్యక్రమం పూర్తి చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారు. అక్టోబర్ 19 నుంచి 28వ తేదీ వరకు ఫార్మెట్-1 నుంచి 8వ ఫార్మెట్ వరకు రూపుదిద్దాలి. దీంతోపాటు ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ రోల్ తయారు చేయాలి. 29వ తేదీ సమగ్ర ఓటర్ల ముసాయిదా జాబితాను నియోజకవర్గ ఎన్నికల అధికారి విడుదల చేస్తారు. ఆరోజు నుంచి నవంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. డిసెంబర్ 24 నాటికి అభ్యంతరాలు పరిష్కారం, 2025 జనవరి 6న తుది జాబితాను ప్రకటించనున్నారు.

'గండికోట'కి తగ్గిన ఇన్‌ఫ్లో

కొండాపురం : గండికోట జలాశయంలోకి కృష్ణా జలాల ప్రవాహం తగ్గింది. ఇదివరకు అవుకు రిజర్వాయర్ నుంచి గాలేరు నగరి సృజలస్రవంతి ప్రధాన కాలువ ద్వారా 10 వేల క్యూసెక్కుల వచ్చేవి. సోమవారం మధ్యాహ్నం 2గంటల నుంచి 5 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో తగ్గినట్లు జీఎన్ ఎస్ఎస్ డీఈ ఉమమహేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోట జలాశయం నీటి పూర్తిసామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 25.6 టీఎంసీలు నీటినిల్వ ఉందన్నారు. గండికోట నుంచి మైలవరం జలాశయానికి ప్రస్తుతం ఉన్న 7500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోని రాత్రినుంచి 5 వేల క్యూసెక్కులకు తగ్గిస్తున్నామని ఆయన వెల్లడించారు. అలాగే గండికోట ఎత్తిపోతల పథకం నుంచి మూడు మోటర్ల ద్వారా 1500 క్యూసెక్కుల నీరు చిత్రావతి బ్యాలెన్స్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నామని వివరించారు. జీకేఎల్ఐ నుంచి ఏడు మోటర్ల ద్వారా 770 క్యూసెక్కుల నీరు పైడిపాళెం జలాశయానికి పంపింగ్ చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గండికోట ప్రాజెక్టు నుంచి గాలేరి నగరి సృజల స్రవంతి ప్రధాన కాలువ నుంచి శెట్టివారిపల్లె మెయిన్ హెడ్ రెగ్యులేటర్ గేటు ద్వారా వామికొండ, సర్వరాయసాగర్ జలాశయాలకు 700 క్యూసెక్కుల నీరు కొనసాగుతున్నట్లు ఆయన తెలిపారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుడిపై నివేదిక పంపండి

గాలివీడు : విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడిపై నివేదిక జిల్లా ఉన్నతాధికారులకు అందించాలని మండల విద్యాశాఖ అధికారి నాగరాజుకు ఆదేశాలు అందాయి. సాక్షిలో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందిస్తూ క్షేత్రస్థాయిలో బాలుడి తల్లిదండ్రులను, ఉపాధ్యాయుడిని విచారించి పూర్తిస్థాయి నివేదికలను పంపాలని కోరారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడికి విద్యాధికారి తెలిపారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

కలికిరి : ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి రాయచోటి ఇన్‌చార్జి డీఎస్పీ సుధాకర్ సోమవారం కలికిరిలో కేసు పూర్వాపరాలు, సాక్షులను విచారించారు. వివరాలు.. కలికిరి పట్టణం చర్చివీధికి చెందిన ఏసురాజు, పట్టణానికి చెందిన ఓ యువకుడికి మధ్య బేకరీ వద్ద చిన్నపాటి తగాదా జరిగింది. తగాదా అనంతరం యువకుడు తన స్నేహితులతో కలిసి ఏసురాజుపై దాడికి పాల్పడ్డాడు. దీనిపై శనివారం ఏసురాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు యువకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో సోమవారం రాయచోటి డీఎస్పీ ఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల వ్యక్తులను విచారించారు. వారు చెప్పిన వివరాలను నమోదు చేసుకున్నారు.

వడ్డిపల్లెలో ఘర్షణ

మదనపల్లె : వినాయకుడి ప్రతిమ అలంకరణ విషయమై ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో డిగ్రీ విద్యార్థి గాయపడిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని వడ్డిపల్లెలో వేర్వేరు చోట్ల రెండు వినాయక విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఓ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన విష్ణు, వినయ్‌లు మరో విగ్రహం ఏర్పాటు చేసిన అఖిలేష్(20)తో.. మీ విగ్రహ అలంకరణ బాగోలేదని, మేము చాలా చక్కగా అలంకరించామని చెప్పడంతో వివాదం మొదలైంది. దీంతో విష్ణు, వినయ్‌లు మరికొంతమందితో కలిసి అఖిలేష్‌ను పక్కకు తీసుకెళ్లి దాడిచేశారు. దాడిలో అఖలేష్ గొంతుకు తీవ్రగాయం కాగా, అతడి కుటుంబ సభ్యులు అక్కడకు వచ్చి నిలదీశారు. దీంతో మొత్తం కుటుంబ సభ్యులపై విష్ణు, వినయ్‌లు తమ అనుచరులతో కలిసి దాడిచేశారు. ఘర్షణలో గాయపడిన అఖిలేష్‌ను స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీలు ఢీ

రాజంపేట : రాజంపేట పట్టణ బైపాస్ రహదారిలో సోమవారం రెండు లారీలు ఢీ కొన్నాయి. ముందువెళుతున్న లారీని, వెనుక వస్తున్న లారీ ఢీ కొనడంతో ఈ రహదారిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ప్రమాదంలో క్యాబిన్‌లో కొండాపురం లావనూరుకు చెందిన డ్రైవర్ నాగేంద్రరెడ్డి ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్‌సిబ్బంది డ్రైవర్‌ను సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. కాని ఎడమ కాలు విరిగిపోయింది. స్థానిక ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు.

బాలికపై కుక్కల దాడి

కమలాపురం: కమలాపురం అంధుల కాలనీకి చెందిన జయన్న కుమార్తె వీధి కుక్కల దాడిలో గాయపడింది. సోమవారం రాత్రి వీధిలోని కుక్కలు కొట్లాడుకుంటూ ఒక్కసారిగా వచ్చి బాలిక పై పడి తీవ్రంగా గాయపరిచాయి.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు



రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నించడం తగదు. గత ప్రభుత్వం పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని కొత్తగా మెడికల్ కళాశాలలు మంజూరు చేసింది. మెడికల్ కళాశాలలు నిర్మిస్తే నీట్ పరీక్ష రాసిన సుమారు 5 లక్షల మంది విద్యార్థులకు ఉపయోగపడుతుందనే ఆశతో ఉన్నారు. అయితే చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకోవడం విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లినట్లే.

–సుంకర చక్రధర్, విద్యార్థి నాయకుడు, పీలేరు



పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర



కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్ర చేస్తోంది. చేసిన తప్పును కప్పి పుచ్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటు.గత ప్రభుత్వంలో మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తి కాకుండానే ప్రారంభించారని మంత్రి సత్యకుమార్ తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కొత్త మెడికల్ కళాశాలలు పూర్తిచేసి విద్యార్థులకు న్యాయం చేయాలి.

– అవుల విష్ణువర్ధన్‌రెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్, సంబేపల్లె మండలం

మా భూములకు నష్ట పరిహారం ఇవ్వండి

పేద రైతుల ఆవేదన



గిరిజన భూముల్లో జేసీబీ యంత్రాలతో చదును చేస్తున్న దృశ్యం

గాలివీడు : తూముకుంట గ్రామం సోలార్‌కు హెచ్‌పీసీఎల్ కంపెనీ వారు నష్ట పరిహారం చెల్లించకుండానే తమ భూమిని స్వాధీనం చేసుకున్నారని పేద రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దిగువపల్లె ప్రకాష్ నగర్‌కు చెందిన పేద రైతులు దాదాపు 20 ఏళ్ల క్రితం భూమిని అనుభవించుకుంటూ పలు పంటలు పండించుకుంటున్నారు.ఈ క్రమంలో కొన్ని సంవత్సరాలుగా పంటలు పండకపోవడంతో పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లి అక్కడే కూలీ నాలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోలార్, రెవెన్యూ అధికారులు తమకు ప్రభుత్వ పరంగా ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా జేసీబీ యంత్రాలతో భూమిని చదును చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి నష్టపరిహారంతో పాటు మరో ప్రాంతంలో భూమి ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి



మా భూములకు పట్టాలిచ్చినప్పటికీ ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా సోలార్ కంపెనీ వారు స్వాధీనం చేసుకుని యంత్రాలతో చదును చేసుకుంటున్నారు. మా పట్ల ఇలా వ్యవహరించడం మంచి పద్ధతి కాదు.

- బుక్కే తులశమ్మ, ప్రకాశ్‌నగర్ కాలనీ, తూముకుంట

ఉన్నతాధికారులు న్యాయం చేయాలి



పేదలమైన తమ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలి. పరిహారం ఇవ్వకుండా భూములను ఖాళీ చేయాలని చెప్పడం తగదు. పరిహారంతోపాటు ఇతర ప్రాంతాల్లో భూములను చూపాలి.

- మూడే లక్ష్మిదేవమ్మ, తూముకుంట

చంద్రబాబుకు భవన నిర్మాణ కార్మికుల ఉసురు తప్పదు

మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం వస్తే ఉచిత ఇసుక అని చెప్పి అయిదు నెలలు దాటుతున్నా ఇంత వరకు ఉచిత ఇసుక అందుబాటులో లేకుండా చేసిన చంద్రబాబుకు పేద ప్రజల, భవన నిర్మాణ కార్మికుల ఉసురు తగలక తప్పదని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకు ఏదో ఒక నాటకం ఆడుతున్నారని తెలిపారు. హామీల అమలు అటుంచి, ప్రతి రోజు పలువురి జీవితాలను ప్రభావితం చేసే ఇసుకను కూడా ప్రజలకు అందుబాటులో లేకుండా చేశారన్నారు. గత ప్రభుత్వం 45 లక్షల క్యూసెక్కుల ఇసుక స్టాక్ పాయింట్లలో నిల్వ చేస్తే ఎన్నికల ఫలితాలు వస్తూనే టీడీపీ నాయకులు దోపిడీ చేశారని ఆరోపించారు. ఇందుకు మంగంపేటలో ఇసుక పాయింట్ నిదర్శనమని పేర్కొన్నారు. ఉచిత మంటూనే లారీ ఇసుక 25 వేల రూపాయలకు విక్రయిస్తున్నారని తెలిపారు. దీనివల్ల పనులు లేక వేలాది మంది కార్మికులు అన్ని ప్రాంతాల్లో రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైల్వేకోడూరులో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలి

రైల్వేకోడూరు నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయాలని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల డిమాండ్ చేశారు. పెనగలూరు, నారాయణ నెల్లూరు, మందరంలలో ఇసుక తెచ్చుకొనే విధంగా స్టాక్ పాయింటు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు.

సీనియర్ ఐపీఎస్‌ల సస్పెన్షన్ ఏపీకి మచ్చ

రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతూ రాష్ట్రంలో సీనియర్ ఐపీఎస్‌లను సస్పెండ్ చేయడం రాష్టానికి మాయని మచ్చ అని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో చట్టాన్ని చంద్రబాబు చేతుల్లోకి తీసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్‌రమేష్, మండల నాగేంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, రామకృష్ణ, భరత్‌కుమార్‌రెడ్డి, బత్తల సుబ్రమణ్యం, శ్రీనివాసులు, బైరెడ్డి అనిల్‌రెడ్డి, కుప్పాలజ్యోతి, సిద్దూ రాయల్, బండారు మల్లి, డీపీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎంఎస్ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మోహన్‌రెడ్డి

మదనపల్లె : ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు 010 ద్వారా జీతాలు చెల్లించడంతో పాటు ప్రభుత్వంలో విలీనం చేసినందున సర్వీస్ రూల్స్ అమలు చేయాలని ఏపీఎంఎస్ ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఎస్టీయూ భవనంలో అన్నమయ్య–చిత్తూరు జిల్లాల ఆదర్శ పాఠశాలల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పి.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జెడ్పీ పాఠశాలలకు ఎలాంటి సర్వీస్ రూల్స్ ఉన్నాయో, వాటినే ఆదర్శ పాఠశాలలకు వర్తింపజేయాలన్నారు. ఏపీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరత్నం మాట్లాడుతూ ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు వెంటనే హెల్త్‌కార్డ్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోకల మధుసూధన్ మాట్లాడుతూ ఆదర్శ ఉపాధ్యాయులకు బదిలీలతో పాటు మరణించిన ఉపాధ్యాయ కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టి ఆదుకోవాలన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జి.జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడారు. సమావేశంలో అన్నమయ్య–చిత్తూరు జిల్లాల కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా చెన్నూరి బాలాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా మోహన్ మురళీ, ట్రెజరర్‌గా కె.పి.నాగరాజన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.శ్రీనునాయక్, మహిళా జిల్లా అధ్యక్షురాలిగా శెట్టిపల్లె శివకుమారి, మహిళా జిల్లా కార్యదర్శిగా సీహెచ్.యోజనగంధి, ఉపాధ్యక్షురాలిగా కె.జయలక్ష్మిలను ఎన్నుకున్నారు.

అర్చకుడి భార్యపై దౌర్జన్యం

సుండుపల్లె: మండల కేంద్రంలోని శ్రీ విరూపాక్షేశ్వర దేవస్థానంలో అర్చకుడిగా విధులు నిర్వహిస్తున్న గడియారం సుబ్రమణ్యం స్వామి భార్యపై కొందరు దౌర్జన్యానికి పాల్పడ్డారు. బాధితురాలి కథనం మేరకు.. ఆలయ ప్రాంగణంలో పశుగ్రాసాన్ని పెంచుకొని గోసేవ చేస్తుండగా వ్యక్తిగత కారణాలతో సుండుపల్లి గ్రామానికి చెందిన కొందరు గోవులకు మేతను కూడా మిగల్చకుండా అక్రమంగా పశు గ్రాసాన్ని దున్నేశారు. ఆలయ అర్చకుడు సుబ్రమణ్యం భార్య వారిని ప్రశ్నించేందుకు ప్రయత్నించగా ఆమెపై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ సంఘటనపై సుండుపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం కోళ్లబైలు పంచాయతీ వెలుగుస్కూల్ ప్రాంతానికి చెందిన రాజారెడ్డి కుమారుడు జి.మధుకర్‌రెడ్డి(40) ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో సోమవారం ఇంటివద్దే పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

భర్తతో గొడవపడి..

భర్తతో గొడవపడిన ఓ మహిళ రామసముద్రం మండలంలో ఆత్మహత్యకు యత్నించింది. కుదురు చీమనపల్లెకు చెందిన ఆటోడ్రైవర్ జబ్బార్ భార్య ఆయేషా(30) భర్త ప్రతిరోజు మద్యం సేవించి ఇంటికి వస్తుండటంతో సోమవారం గొడవ పడింది. గొడవలో భర్త ఆమెపై చేయి చేసుకోగా మనస్తాపంతో ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రైలు ప్రమాదంలో తెగిపడిన యువకుడి చేయి



ప్రమాదంలో చేయి పోగొట్టుకున్న ధనుష్

నందలూరు : అన్నమయ్య జిల్లా నందలూరు రైల్వే కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం రైలు కింద పడి యువకుడి చేయి తెగింది. గుంతకల్లుకు చెందిన కురుబ ధనుష్ పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం గుంతకల్ నుంచి కళాశాలకు వెళ్లేందుకు ముంబై నుంచి చెన్నై వెళ్తున్న (12163) ఎక్స్‌ప్రెస్ రైలులో పుత్తూరుకు వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు నందలూరులో అదే రైలుకింద పడి చేయి పూర్తిగా తెగిపడిపోయింది. వెంటనే స్థానిక ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది స్పందించి క్షతగాత్రుడిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. 108 వాహనాన్ని సంప్రదించగా గంట ఆలస్యం అవుతుందని తెలపడంతో ఆటోలో తీసుకెళ్లారు.

మంగంపేట అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మంత్రి రాంప్రసాద్ రెడ్డి



ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లె హరిజనవాడ, అరుంధతివాడ, పంచాయతీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంగంపేట ఆర్‌ఆర్–5లో నిర్వాసిత కుటుంబాలకు మంత్రి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన పునరావాసం కల్పించి మంగంపేట అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి, సర్పంచ్ మునుగు సుధాకర్ హాజరయ్యారు. కాగా మంగంపేట కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతివాడ పునరావాసం ప్యాకేజీ ఇంకా పెండింగ్‌లో ఉండగా ఇంటిపట్టాలు పంపిణీ చేయడంపై గ్రామస్తులు ఇంటి పట్టాల పంపిణీని వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ వైఖోమ్ నదియా దేవి, తహసీల్దార్ పీర్ మున్నీ, ఎంపీడీఓ విజయారావు తదితరులు పాల్గొన్నారు.

కె.కె.కొట్టాల వద్ద వ్యర్థాల పైపులైన్ లీకేజీ

- లీకేజీ పనులను అడ్డుకున్న కె.కె.కొట్టాల గ్రామస్తులు
- శుద్ధి ప్లాంటును నిలిపి వేసిన యురేనియం అధికారులు



లీకేజీ పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

వేముల : మండలంలోని కె.కె.కొట్టాల వద్ద యురేనియం వ్యర్థాలు పొలాలపై వెళ్లాయి. దీంతో గ్రామస్తులు గ్రామాన్ని, పొలాలు తీసుకుని పరిహారం ఇవ్వాలని ఆందోళనకు దిగారు. పైపులైన్ లీకేజీ పనులను అడ్డుకున్నారు. కాగా యురేనియం ప్రాజెక్టులో యురేనియం ముడి పదార్థాన్ని శుద్ధి చేయగా వచ్చే వ్యర్థాలను పైపులైన్ ద్వారా కె.కె.కొట్టాల సమీపంలోని టెయిలింగ్‌కు తరలిస్తున్నారు. సోమవారం వ్యర్థాలను తరలించే పైపులైన్ టెయిలింగ్ పాండ్ సమీపంలో లీకై న వ్యర్థ పదార్థం సమీపంలోని పొలాలపై పారింది. పంటలు సాగులో ఉన్నప్పుడు పైపులైన్ లీకై వ్యర్థ పదార్థాలు పొలాలపై ప్రవహిస్తే పరిస్థితి ఏమిటని అధికారులపై గ్రామస్తులు మండిపడ్డారు. ఇలాంటి సంఘటనలు తరుచూ జరుగుతున్నా పట్టించుకోలేదని యురేనియం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులైన్ లీకేజీని సరి చేసేందుకు వచ్చిన వారిని అడ్డుకుని వెనక్కి పంపించివేశారు. దీంతో గ్రామస్తుల ఆందోళనతో యురేనియం శుద్ధి చేసే కర్మాగారాన్ని నిలిపివేశారు. పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్, సీఐ నాగరాజు, ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్‌లు రంగ ప్రవేశం చేసి ఆందోళన చేస్తున్న కె.కె.కొట్టాల గ్రామస్తులతో చర్చించారు. మీ సమస్యలపై మంగళవారం పులివెందులలో చర్చిద్దామని డీఎస్పీ మురళీ నాయక్ గ్రామస్తులకు నచ్చజెప్పారు. దీంతో గ్రామస్తులు పైపులైన్ లీకేజీ పనులు చేసుకునేందుకు అంగీకరించారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : వరకట్న వేధింపులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. బీకే పల్లె లక్ష్మీనగర్‌కు చెందిన భవానీ(25)కు బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు పంచాయతీ చౌటగుంటపల్లెకు చెందిన రాజశేఖర్‌తో 2019లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెళ్లైన ఏడాది తర్వాత నుంచి రాజశేఖర్ తన తల్లి ఆదిలక్ష్మితో కలిసి భవానిని అదనపు కట్నం తీసుకురావాల్సిందిగా వేధించసాగాడు. ఈ విషయమై పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు సైతం జరిగాయి. ఇటీవల వేధింపులు ఎక్కువ కావడంతో భవాని పుట్టినింటికి వచ్చి ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అత్తవారింటి వేధింపులపై ఫిర్యాదు చేసింది. ఆ మేరకు భర్త రాజశేఖర్, అత్త ఆదిలక్ష్మిలపై కేసు నమోదు చేసి, ఏఎస్‌ఐ వెంకటరమణ విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

హత్యాయత్నానికి గురైన వ్యక్తి మృతి

మదనపల్లె : నాలుగు నెలల క్రితం హత్యాయత్నానికి గురైన వ్యక్తి అనారోగ్యంతో మరణించిన ఘటన ఆదివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. నీరుగట్టువారిపల్లె మాయాబజార్‌కు చెందిన చేనేతకార్మికుడు సాంబశివ(30)పై అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ నసీబ్, మే 3వ తేదీన వ్యక్తిగత కక్షలతో దాడిచేసి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన సాంబశివను స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. అక్కడి ఆస్పత్రిలో కొద్దిరోజుల పాటు చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన సాంబశివ అనారోగ్యంతో బాధపడుతూ, ఆదివారం రాత్రి మృతి చెందాడు. బంధువులు, కుటుంబ సభ్యులు రాత్రికి రాత్రే అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ విషయమై టూటౌన్ పోలీసులను విచారిస్తే.. తమకు సమాచారం లేదన్నారు.

కడప-చెన్నై రహదారిపై లారీ దగ్ధం



మాధవరం-1 గ్రామ సమీపంలో దగ్ధం అవుతున్న ఇసుక లారీ

సిద్దవటం : సిద్దవటం మండలంలోని మాధవరం–1 గ్రామ శివారులో ఉన్న ఇండేన్ గ్యాస్ గోడౌన్ సమీపంలో కడప– చెన్నై రహదారిపై సోమవారం సిలికా ఇసుక లారీ దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దనూరు నుంచి ఇసుక నింపుకొని లారీ చెన్నైకి బయలుదేరింది. సిద్దవటం మండలంలోని ఇండేన్ గ్యాస్ గోడౌన్ సమీపంలోకి రాగానే లారీ ఇంజిన్‌లో మంటలు వ్యాపించడంతో డ్రైవర్ ప్రసాద్ అప్రమత్తమై లారీని రోడ్డు పక్కన ఆపేసి దిగేశాడు. ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్, సిద్దవటం ఎస్‌ఐ చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



చెట్టుకు వేలాడుతున్న రమేష్ మృతదేహం



ధర్నా చేస్తున్న బంధువులు, సీపీఐ నాయకులు

- పెట్రోలు బంకు సమీపంలో చెట్టుకు ఉరి
- హత్య చేశారని బంధువుల ఆందోళన

పోరుమామిళ్ల : మైదుకూరు రోడ్డులోని హెచ్‌పీ పెట్రోలు బంకులో పని చేస్తున్న లక్కినేని రమేష్ అలియాస్ జాన్(42) సోమవారం తెల్లవారుజామున బంకుకు ఎదురుగా ఉన్న చెట్టుకు ఉరి తాడుకు వేలాడుతూ కనిపించాడు. బంకులో పని చేస్తున్న మరో వ్యక్తి చెట్టుకు శవమై వేలాడుతూ కనిపించిన రమేష్‌ను చూడటంతో సమాచారం వెలుగు చూసింది. ఆర్‌అండ్‌బీ కార్యాలయం వెనుక వైపు (బంకుకు ఎదురుగా) ఉన్న చెట్టుకు రమేష్ తాడుకు వేలాడుతూ మృతి చెందిన విషయం తెలిసి తెల్లవారేలోపు బంధువులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే ఎస్‌ఐ, పోలీసులకు సమాచారం తెలిసి పరిశీలించారు.

మృతుడు రమేష్ ఈదుళ్లపల్లెకు చెందిన వాడైనా భార్య మరియమ్మ, కుమారునితో చల్లగిరిగెలలో ఉంటున్నారు. ఇతని ఒక్కగానొక్క కొడుకు అనారోగ్యంతో దశాబ్దకాలం పైగా మంచానికే పరిమితమయ్యాడు. రమేష్‌ను హత్య చేసి చెట్టుకు ఉరి వేశారని బంధువులు ఆందోళనకు దిగారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి పంపేందుకు ఎస్‌ఐ చేసిన ప్రయత్నాన్ని వారు అడ్డుకున్నారు. వారికి సీపీఐ నాయకులు అండగా నిలిచి బంకు వద్ద ధర్నాకు దిగారు. బంకు యజమాని రాజా శవం గురించి పట్టించుకోకుండా పెట్రోలు అమ్మకాలు చేసుకుంటున్నాడని, రమేష్ హత్యలో అతని ప్రమేయం ఉందని వారు ఆరోపించారు. రిపోర్టు ఇవ్వండి.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తాం.. వాస్తవాలు తెలుస్తాయని ఎస్‌ఐ కొండారెడ్డి చెప్పిన మాటలను బంధువులు, సీపీఐ నాయకులు పట్టించుకోలేదు. రోడ్డుపై బైఠాయించి న్యాయం కావాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడ జనం భారీగా గుమికూడారు.

శవాన్ని బంకు వద్దే ఉంచి మధ్యాహ్నానికి కూడా ఆందోళన కొనసాగిస్తుండటంతో సీఐ శ్రీనివాసులు రంగప్రవేశం చేసి, మృతుని బంధువులతో, బంకు యజమానితో మాట్లాడి రాజీ ప్రయత్నం చేసి ఆందోళన లేకుండా చేయగలిగారు. సాయంత్రం 4 గంటలకు శవాన్ని పోస్టుమార్టానికి తీసుకెళ్లేందుకు బంధువులు అంగీకరించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ కొండారెడ్డి మాట్లాడుతూ కేసు నమోదు చేస్తామని, హత్యగా తేలితే కేసును హత్యగా మారుస్తామని, ఆత్మహత్యగా తేలితే అదే నమోదు చేస్తామని చెప్పారు.

పెట్రోలు బంకులోని సీసీ కెమెరాల్లో రాత్రి 12–30 గంటల వరకు రమేష్ పని చేసినట్లు ఆ తరువాత రోడ్డుపైకి వెళ్లినట్లు రికార్డయింది. రోడ్డుపైకి వెళ్లిన రమేష్ ఎటుపోయాడో తెలియడం లేదు. మళ్లీ బంకులోకి రాలేదు. బంకులో నిద్ర పోతున్న మరో వర్కర్ తెల్లవారు జామున లేచి బయటకు వచ్చి చూసేటప్పటికి ఎదురుగా చెట్టుకు రమేష్ వేలాడుతూ కనిపించడంతో విషయం బయటకు తెలిసిందని చెబుతున్నారు. అయితే అర్ధరాత్రి నుండి తెల్లవారు జాము వరకు ఆయిల్ కోసం వాహనాలు రాలేదా? వచ్చినవారు హారన్ కొట్టి లేదా నేరుగా బంకు వద్దకు వచ్చి లోపలున్న వర్కర్‌ను లేపకుండా వెళ్లారా? వర్కర్ తెల్లవారుజాము దాకా నిద్రపోతూనే ఉన్నాడా? ఈ ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. బంధువులు ఆరోపిస్తున్నట్లు ఇందులో యజమాని రాజా పాత్ర ఎంత వరకు అన్నది తేలాల్సి ఉంది. మెడకు తాడు బిగించి చంపి, అక్కడకు తెచ్చి చెట్టుకు వేలాడదీశారని వస్తున్న ఆరోపణలే నిజమైతే ఇందులో ఇద్దరు ముగ్గురి పాత్ర ఉండి ఉంటుంది. పోలీసుల విచారణలో వాస్తవాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.